

## ఎంఆర్‌పి దాటి ఎరువులు అమ్మొద్దు

### డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి వార్నింగ్

**ప్రజాపక్షం/మాగనూరు :** మాగనూరు మండలంలో ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి యం.సక్రియ నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన గరిష్టచిల్లర ధర ఎంఆర్‌పి దాటి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల సందర్భంగా మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు బిల్లులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాతో పాటు అన్నిరకాల ఎరువులు తగిన నిల్వలతో ఉన్నాయని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ శాఖ యూరియా యాప్‌ను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. రైతులు ఇంటి నుంచే మొబైల్ యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకుని, పంటలకు అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ప్రకారమే ఎరువులు, విత్తనాలు అమ్మాలని, ప్రతి విక్రయానికి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, రైతులకు ఎల్లప్పుడూ సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై లైసెన్స్ రద్దుతో సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సక్రియ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన వార్షికోత్సవం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంతోపాటు చొక్కన్నపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించి బొడ్రాయికు గంగాభిషేకం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ రక్షణ కోసం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే పండుగలు, గ్రామ దేవతల ఆశీస్సులతోనే ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో పాడి పంటలు సమృద్ధిగా పండి, సుఖసంతోషాలతో జీవించాలని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్‌లు వేడుకున్నారు. ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్రాయి, గ్రామ, కుల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జన్నమోని శ్రీనివాస్ ముదిరాజు, పంచాయతీ కార్యదర్శిగిరి, వార్డు సభ్యులు కవిత రమేష్, వాణి పురుషోత్తం, మంజుల శ్రీను, శేఖర్, దేవేందర్, మల్లేశ్వరి రంగనాథం, వెంకటేష్, మానస రాజు, రమేష్, సునీత, రవీందర్‌రెడ్డి, మట్ట భరత్‌గౌడ్, శంకరయ్య, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రేణుక ఎల్లమ్మ పండుగకు విరాళం...**

మండల పరిధిలోని గుండాల గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాల నిర్వహణకు పోతేపల్లి గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ రూ.5వేల విరాళం అందజేశారు. అనంతరం గుండాల గ్రామ ఉప సర్పంచ్ లింగం, కొమ్ము కృష్ణ, రామకృష్ణ, వెంకటయ్య, యాదగిరిలు కొండల్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## అంగన్వాడీ పిల్లలకు అక్షరాభ్యాసం, డ్రెస్సుల పంపిణీ

**ప్రజాపక్షం/మాగనూరు :** మండల పరిధిలోని మందిపల్లి గ్రామంలోని 2వ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో చిన్నారులచేత అక్షరాలు దిద్దించి, వారి విద్యా జీవితాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలందరికీ కొత్త డ్రెస్సులను పంపిణీ చేశారు. అదేవిధంగా సెలవు రోజుల్లో మిగిలిన బియ్యాన్ని పిల్లల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, సహాయకురాలు, గ్రామ పెద్దలు పాల్గొని చిన్నారులకు ఆశీర్వదించారు.

## మొహరంను శాంతియుతంగా నిర్వహించుకోవాలి : ఎస్ఐ.రమేశ్

**ప్రజాపక్షం/ ఉట్కూర్ :** మొహరం పండుగ సందర్భంగా ఉట్కూర్ మండలంలోని ఎంకంపేట్ పీర్ల చావడి వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును ఉట్కూర్ ఎస్సై రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీర్ల నిర్వాహకులు, కమిటీ సభ్యులకు భద్రతా పరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పీర్ల ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరపున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన భద్రా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు, యువకులు ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కోరారు. పజల సహకారంతో మొహరం పండుగను విజయవంతంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పీర్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** జడ్పీహెచ్ఎస్ వీపనగండ్ల పాఠశాలలో శుక్రవారం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు పార్వతమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని వసతులను కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.భాను ప్రకాష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయితీ సహకారం అవసరమని సర్పంచు ను కోరారు. దీనికి స్పందించిన సర్పంచు పార్వతమ్మ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఎల్‌ఎలకు ఓటరు సవరణ ప్రక్రియపై దిశా నిర్దేశం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 7 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో (ఓటర్ సవరణ ప్రక్రియ) పై అవగాహన శిక్షణా శిబిరం నిర్వహించారు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి వాటికి శ్రీహరి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, రాజేంద్ర ప్రసాద్ బిఎల్‌ఎలకు ఓటరు సవరణ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూన్ 25 నుంచి జులై 24 వరకు నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు అందించే ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను అర్హులైన ప్రతి ఓటరుకు చేరేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం జరుగుతున్న ఓటరు సవరణ ప్రక్రియలో నియోజకవర్గంలో అర్హులైన ప్రతి వ్యక్తి ఓటు హక్కును కాపాడేందుకు మనమందరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మక్తల్‌లో 80వేల ఓట్లను చోరీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఓటరు సవరణ ప్రక్రియ ఈనెల 25న ప్రారంభమై, వచ్చే నెల 24 వరకు జరుగుతుందని తెలిపారు. తర్వాత వచ్చే నెల 31న ముసాయిదా ప్రచురణ జరుగుతుందన్నారు. ఓటరు సవరణ ప్రక్రియలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే జులై 31 నుంచి ఆగష్టు 30 వరకు స్వీకరిస్తారని అంతలోపే మన ఓటు హక్కును కాపాడుకోవడానికి వీలవుతుందని మంత్రి సూచించారు. ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సకాలంలో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒకవేళ ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లినా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని బిఎల్‌ఎలకు సూచించారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన వారితో ఓటు హక్కుపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రతిజ్ఞ చేయించారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు రెండు కంప్యూటర్లు బహుకరణ

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి 2 కంప్యూటర్ సిస్టమ్స్‌ను బహుమతిగా ప్రదానం చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యార్థుల సమక్షంలో మంత్రి చేతుల మీదుగా కళాశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా డిగ్రీ మొదటి సంవత్సరంలో జిల్లాలో టాపర్స్‌గా నిలిచిన నలుగురు అమ్మాయిలను శాలువాతో ఘనంగా సత్కరించారు. డిగ్రీ కాలేజీకి త్వరలో కొత్త భవనాన్ని కూడా నిర్మించనున్నట్లు మంత్రి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి నేర్చుకోవాలి

### కలెక్టర్ ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట :** జిల్లాలో ప్రతి విద్యార్థి ప్రాథమికంగా చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా విద్యా కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సిహెచ్.ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి, మండల విద్యాధికారులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సమావేశంలో విద్యార్థుల అభ్యాస ఫలితాలు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, బడిబాట, నమోదు, పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, అపార్, యుడిసె, ఎఫ్ఆర్ఎస్ హాజరు, వైఐసి అమలు, డిజిటల్ లెర్నింగ్, ప్రీప్రైమరీ విద్య తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పిల్లల అభ్యాస నాణ్యత పెరగడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు దీక్షా వేదికలో అందుబాటులో ఉన్న శిక్షణా కోర్సులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఖాన్ అకాడమీ, తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్, డిజిటల్ విద్యా వేదికల వినియోగం ద్వారా విద్యార్థులకు అదనపు అభ్యాస అవకాశాలు కల్పించాలని ఆదేశించారు.

**నాణ్యతే లక్ష్యం – ర్యాంకులు సహజ ఫలితం**

సమావేశం ముగింపులో కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంకులు లక్ష్యం కాదు.. ప్రతి సూచికలో నాణ్యతే లక్ష్యం. నాణ్యత పెరిగితే ర్యాంకులు సహజంగానే మెరుగుపడతాయి. ప్రతి విద్యార్థి నేర్చుకోవాలి. ప్రతి పాఠశాల మెరుగుపడాలి. ప్రతి మండలం ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎం.గోవిందరాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ సెక్టోరల్ అధికారులు రాజేంద్ర కుమార్, నాగార్జున రెడ్డి, జిసిడిఓ సంగీత, జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో కలెక్టర్ ప్రియాంక ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. లెక్కలను సులభంగా ఎలా చేయాలో బోర్డుపై చేసి చూపించారు. ఉట్కూర్ మండలంలోని తిప్రస్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయాన్ని, మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న నిత్యావసర సరుకులను పరిశీలించారు. మెనూ పాటించకపోవడంపై వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని 2వ, 4వ తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు బోర్డుపై లెక్కలు చేసి చూపించారు. ఉట్కూర్ మండల కేంద్రంలోని పాఠశాలల సందర్శన ఉట్కూర్ మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ వీధిలో గల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ప్రియాంక సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ తప్పనిసరిగా పాటించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. బడి బాట కార్యక్రమం ద్వారా ఎంతమంది విద్యార్థులను నమోదు చేశారో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ్‌నగర్ పాఠశాలలో బియ్యాన్ని



పరిశీలించిన కలెక్టర్, బియ్యంలో పురుగులు ఉన్నట్లు గుర్తించి, సంబంధిత బియ్యం బస్తాలను తిరిగి పంపించి కొత్త బియ్యం బస్తాలను తెప్పించుకోవాలని పాఠశాల హెచ్ఎంకు ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయురాలు బోధిస్తున్న ఇంగ్లీష్ పాఠం బోధనా విధానాన్ని పరిశీలించారు. అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులను అడిగి మళ్లీ తెలుసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. పదో తరగతి పరీక్షల్లో అందరూ 550 మార్కులకు పైగా సాధించాలని ఆకాంక్షించారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. తదుపరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి కంప్యూటర్ గదిని పరిశీలించారు. పదో తరగతి గదిలో హిందీ పాఠం బోధన విధానాన్ని పరిశీలించి, విద్యార్థులను హిందీలో ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. పాఠశాలలోని మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో అదనపు మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపిడిఒకు సూచించారు. పక్కనే ఉన్న ఉర్దూ మీడియం తరగతులను కూడా పరిశీలించారు. ఉర్దూ మీడియం తరగతి గదులు శిథిలావస్థకు చేరాయని గ్రామ సర్పంచ్ రేణుకా భరత్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంపిడిఒ కిషోర్ కుమార్, ఎంపిఒ బాలాజీ, ఉప సర్పంచ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితులు పాల్గొన్నారు.

# యువతకు రాహుల్ గాంధీ ఆదర్శం

### డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భారతదేశ యువతకు ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి అధ్యక్షతన ఘనంగా వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ శ్రేణుల మధ్య రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ ప్రజల సంక్షేమం సామాజిక న్యాయం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజా సమస్యల పరిరక్షణకు సంబంధించిన పోరాటం యువతకు స్ఫూర్తినిచ్చి ప్రేరణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా శ్రేయస్సు కోసం మరింత కృషి చేస్తున్న నాయకుడు భావితరాల భవిష్యత్తు, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ అని నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వారి సహాయకులకు, అభాగ్యులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరే రాములు, అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, శరవంద, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సహదేవ్, బి. కృష్ణ, చీర్ల జనార్ధన్ సాగర్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రి పక్కన తవ్విన గుంతలు ప్రాణాల మీదకు తెస్తున్న నిర్లక్ష్యం

**ప్రజాపక్షం/అయిజ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ ప్రభుత్వ ఆసుపత్రి పక్కన అధికారులు తవ్వి వదిలేసిన గుంతలతో రోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన భద్రతా చర్యలు తేకుండా, పనులను మధ్యలోనే ఆపేయడం వల్ల అత్యవసర సమయాల్లో వచ్చే రోగులకు ఇబ్బందికరంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వ ఆసుపత్రి పక్కన తవ్విన గుంతలు. ప్రాణాల మీదకు తెస్తు స్థానికులకు, రోగులకు, నిత్యం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

డ్రైనేజీ లేదా పైప్‌లైన్ పనుల పేరుతో అధికారుల నెలల క్రితం భారీ గుంతలు తవ్వి, ఆ తర్వాత వాటిని పూడ్చడం గానీ, కనీస హెచ్చరిక బోర్డులు పెట్టడం గాని చేయలేదు. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించడం అత్యంత ప్రమాదకరంగా మారింది. అనేక మంది గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు ఈ గుంతల గుండానే ఆసుపత్రికి చేరుకోవాలి. వర్షం పడితే చాలు, ఈ గుంతలు నీటితో నిండిపోయి కనీసం రోడ్డు ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి, అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

### జిల్లా కలెక్టర్, గద్వాల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో భూ సేకరణ ఆలస్యం కావడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలన్నారు. గట్టు ఎత్తిపోల పథకంలో భాగంగా రిజర్వాయర్, సమాంతర కాలువల నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణ వేగవంతం కావాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలలో పెండింగులో ఉన్న 541 ఎకరాల్లో గత 15 రోజుల్లో 56 ఎకరాలకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చినందున మిగిలిన భూసేకరణ కూడా చేపట్టాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లాలో ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించి రివ్యూ నిర్వహించడం జరుగుతుందని సంబంధిత అధికారులు భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని సాధించి నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డివో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఇతర ఇంజనీర్లు, ఆయా మండలాల తాహసీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## ఒత్తిడి లేని విద్యతో ఉన్నత శిఖరాలు సాధ్యం

### తూంకుంట ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** విద్యార్థులకు ఒత్తిడిలేని, విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశాలు మెరుగుపడతాయని తూంకుంట గ్రామ సర్పంచ్ పలుస రామన్ గౌడ్ అన్నారు. మండలంలోని తూంకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పలుస రామన్ గౌడ్, విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ సామాజిక బాధ్యతలను పెంపొందించే నిర్మాణాత్మక విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు, రాంబాబు, ఉపాధ్యాయులు క్రాంతి, మురళీధర్, అంగన్‌వాడీ టీచర్లు పారిజాతమ్మ, లక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక జిపిడిపిని తయారు చేసుకోవాలి

### గొంగోళ్ల ఈశ్వర్

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం అలంపూర్ మండలం సింగవరం గ్రామ సర్పంచ్ సూచనలు 16వ ఆర్థిక సంఘం 4.35లక్షల కోట్లను గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రామాలకు కేటాయించింది. ఇది 15వ ఆర్థిక సంఘంతో 2.36 లక్షల కోట్లు పోలిస్తే దాదాపు 80% అధికంగా కేటాయించడం జరిగింది. అందువల్ల గ్రామాభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. కాబట్టి సర్పంచులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది. తెలంగాణకు 16 ఫైనాన్స్ కమిషన్ 5 సంవత్సరాలకు గాను మొత్తం ఫండ్స్ 9968 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఇందులో బేసిక్ గ్రాంట్‌గా 7974 కోట్ల రూపాయలు, పెర్ఫార్మెన్స్ గ్రాంట్ 1994 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. 2026–27 ఆర్థిక సంవత్సరంగాను తెలంగాణకు 1280 కోట్ల రూపాయలను 16వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించింది. ఈ మొత్తాన్ని త్వరలో తెలంగాణకు పంపనున్నట్లు కేంద్రం తెలిపింది.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/అయిజ :** అయిజ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా.ఎస్.ఎ.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు ఉత్తనూర్ జయన్న ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, తమ చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషకరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్.మద్దిలేటి, మైనర్‌బాబు, మహబూబ్ పాషా, చిన్ని కృష్ణ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాల మల్లికార్జున్, యూత్ టౌన్ ప్రెసిడెంట్ డి.సూర్యచంద్ర, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్, పాండురంగ , గాలిరెడ్డి, ఉప్పల లక్ష్మన్న, మహేష్, సిందనూరు నరసింహులు, ఉప్పల తిమ్మారెడ్డి, ఉత్తనూరు తదితరులు పాల్గొన్నారు.

